

అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

## పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలి

- సర్కిళ్ల వారీగా టీఎస్‌బీపాస్ ఫైళ్లను పరిష్కరించాలి
- కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, అక్టోబర్ 25 : పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో సర్కిళ్ల వారీగా టీఎస్ బీపాస్ పెండింగ్ ఫైళ్లు, పన్నుల వసూళ్ల పురగోతిపై పన్నుల విభాగం, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 92.21 కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యం కాగా, ఇప్పటి వరకు కేవలం రూ. 34.21 కోట్లు మాత్రమే వసూళ్లు చేశారన్నారు. మిగిలిన పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలన్నారు. ఆస్తి పన్నుతో పాటు తాగునీటి పన్నులను వసూళ్లు చేయాలన్నారు. ఆర్‌ఐల వారీగా పన్నుల వసూళ్ల టార్గెట్లను విధించారు. పక్షం రోజులో పన్నుల వసూళ్లలో పురోగతి సాధించాలని ఆయన అధికారులను ఆదేశించారు. లక్ష్యాలను సాధించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తూనే క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను చేపట్టాలన్నారు. ప్రతి రోజూ పన్నుల వసూళ్లను ఆర్‌వో, ఆర్‌ఐలు పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రేటర్ పరిధిలో మ్యూటేషన్ అయిన నూతన గృహాలను గుర్తించి వాటికి ఆస్తీ పన్ను మదింపు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. బల్దియా అదాయం పెంచేలా కొత్త గృహాలకు ఆస్తీ పన్నులు మదింపు చేయాలన్నారు. సీటీజన్ చార్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రజల వినతులు, ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఆదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, సీపీ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, రవీందర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఆర్‌వో, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

## కేయూ దూరవిద్య డిగ్రీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న కేయూ వీసీ ప్రొఫెసర్ రమేశ్

హనుమకొండ చౌరస్తా, ఆక్టోబర్ 25 : ఆగస్టులో నిర్వహించిన కాకతీయ విశ్వవిద్యాలయ దూరవిద్య డిగ్రీ మొదటి, రెండు, మూడో సంవత్సరం బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ పరీక్ష ఫలితాలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ప్రొఫెసర్ మహమ్మద్ ముస్తఫా, డాక్టర్ ఏ నరేందర్ పాల్గొన్నారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూడొచ్చని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు.

## దీప్తికి కేయూ వీసీ రమేశ్ అభినందనలు



దీప్తి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 25 : ఈ నెల 22 నుంచి 28 తేదీల్లో రిపబ్లిక్ ఆఫ్ చైనాలోని హాంగౌట్జ్ నగరంలో నిర్వహిస్తున్న ఆసియా పారా క్రీడల్లో వరంగల్ జిల్లా తొర్రూరు మండలంలోని అనుబంధ కళాశాల సమతా డిగ్రీ, పీజీ కాలేజీ పూర్వవిద్యార్థిని జీవంజి దీప్తి మహిళల 400 మీటర్ల పరుగుపందెంను 56.69 సెకండ్లలో పూర్తి చేసి, ఆసియా పారాగేమ్స్‌తో పాటు ఆసియా రికార్డును సృష్టించి టీ 20 క్యాటగిరిలో బంగారు పతకం పొందగా, కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆమెకు అభినందనలు తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయ క్రీడాకారులు మున్ముందు మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి దీప్తి కాకతీయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల పూర్వవిద్యార్థిని, 2023 సంవత్సరంలో తన బీఏ మూడో సంవత్సరం పూర్తి చేసిందని విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ టీ సవితా జ్యోత్స్న వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు జీవంజి దీప్తిని అభినందించారు.

# గ్రీవెన్స్‌సెల్‌తో త్వరగా కేసులు పరిష్కారం

**కలెక్టర్ సిక్తా పట్నాయక్**

హనుమకొండ, అక్టోబర్ 25 : స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను తిరిగి అప్పగించాలంటే తగిన ఆధారాలు చూపించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. తద్వారా గ్రీవెన్స్ కమిటీ ద్వారా కేసులు త్వరగా పరిష్కరించుకోవచ్చున్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశం మందిరంలో గ్రీవెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రూ. 50 వేలకు మించి రూ.10 లక్షలకు లోపు నగదు లేదా బంగారం, వెండి, ఇతర వస్తువులకు సంబంధించి ఆధారాలను కలెక్టరేట్‌లోని 2వ అంతస్తు రూమ్ నంబర్ ఎస్ 21లోని గ్రీవెన్స్ కమిటీకి అప్పీల్ చేస్తే వాటిని పరిశీలించి, వెంటేనే విడుదల చేస్తారని తెలిపారు. రూ.10 లక్షల కన్న మించిన నగదును, బంగారం, వెండి, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్న కేసుల్లో ఆదాయ పన్ను, వాణిజ్య పన్నుల శాఖలకు సమాచారం అందించిన తర్వాత వారి నుంచి క్లియరెన్స్ రాగానే గ్రీవెన్స్ కమిటీ విడుదల చేస్తుందని చెప్పారు. పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్న సొమ్మును కచ్చితంగా రశీదును అందించడంతో పాటు గ్రీవెన్స్ సెల్‌కి ఎండార్స్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్‌శ్రద్ధ శుక్లా, డీఆర్‌డీవో కే శ్రీనివాస్ కుమార్, డీసీఈవో జీ నాగేశ్వర రావు, డీటీవో రాజు పాల్గొన్నారు.




కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

## నిబంధనల మేరకు..అధికారులు విధులు నిర్వర్తించాలి

**తూర్పు రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా**



ఎన్నికల కోడ్ అమలుపై అధికారులతో మాట్లాడుతున్న షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, అక్టోబర్ 25 : ఎన్నికల సంఘం నిబంధనల మేరకు.. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తూర్పు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులకు సూచించారు. బుధవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో తూర్పు నియోజకవర్గంలోని ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీవీటీ, ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎన్నికల నియమావళికి లోబడి సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజవర్గ పరిధిలో 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. షిఫ్ట్‌ల వారీగా 24 గంటలు నాలుగు బృందాలు విధులు నిర్వస్తాయన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేలా డబ్బులు, మద్యం పంపిణీ చేయకుండా గట్టి నిఘా పెడుతామన్నారు. నగరంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని తనిఖీలు చేస్తున్నామన్నారు. నగరంలోకి ప్రవేశ మార్గాలుగా ఉన్న జాన్‌పీరీలు, నాయుడు పెట్రోల్ పంపులతో పాటు ఎంజీఎం జంక్షన్ వద్ద చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేసి స్టాటిస్టిక్ సర్వేలెన్స్ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోకి అక్రమ మద్యం, డబ్బులు రాకుండా ఎస్‌ఎస్‌టీ బృందాలతో చెక్‌పోస్ట్‌ల 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఫ్లయింగ్ స్క్వాడ్‌కు వాహనాల తనిఖీతో పాటు సీసీటీవీ మౌంటెడ్ వాహనాలను కేటాయించామన్నారు. ఎక్కువ మొత్తంలో డబ్బు పట్టుబడితే సీజ్ చేసి, జిల్లా గ్రీవెన్స్ సెల్‌లో జమ చేయాలని, 10 లక్షలకు పైబడి డబ్బు సీజ్ చేస్తే ఇన్‌కం ట్యాక్స్ శాఖ వద్ద జమ చేయాలని సూచించారు. సువిధ ద్వారా ఎప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేయాలన్నారు. సీ విజిల్ ద్వారా వచ్చే ఎన్నికల నియమావళి ఉల్లంఘనల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈఎస్ఎంఎస్ యాప్‌లో సీజ్ చేసిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ బోనాల కిషన్, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఏఈఆర్‌వోలు ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ, వీసీటీ, ఎన్నికల వ్యయ పరిశీలన బృందాల సభ్యులు పాల్గొన్నారు.

# ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

**వైభవంగా పద్మాక్షిదేవి శాంతి కల్యాణం**

హనుమకొండ, అక్టోబర్ 25 : హనుమకొండ పద్మాక్షికాలనీలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో పరిసమాప్తమయ్యాయని ఆలయ అర్చకులు నాగిళ్ల శంకర్‌శర్మ, దేవాలయ వేద పండితుడు షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం ఉదయం 11 గంటలకు పద్మాక్షిదేవి శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సా యంత్రం 6 గంటలకు తెప్పోత్సవం (పద్మాక్షి తటాకం నం దు) జరుగుతుందని అర్చకులు తెలిపారు. ఉత్సవాలు పా ల్గొన్న భక్తులకు ఆలయ వేద పండితుడు షణ్ముక పద్మనాభ అవధాని మహాదాశీర్వచనం చేశారు. ఏటా నవరాత్రి ఉత్సవాల్లో ఇలాగే భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని అర్చకుడు శంకర్‌శర్మ తెలిపారు.

**దుర్గమాత దీక్ష విరమణ..**

న్యూశాయంపేట: గ్రేటర్ 31వ డివిజన్ న్యూ శాయంపేటలోని రాజరాజేశ్వర ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల ముగింపును పురస్కరించుకొని అమ్మవారి మాలధారణ దీక్ష విరమణ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు పానుగంటి నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో భక్తులు దీక్షలు చేపట్టారు. తొమ్మిది రోజులుగా చేపట్టిన దీక్షలు వైభోపేతంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తాళ్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



హనుమకొండలో...



న్యూశాయంపేట : దుర్గమాత దీక్ష విరమణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నయిూమొద్దీన్

## మైనార్టీల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

**మైనార్టీ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నయిూముద్దీన్**

హనుమకొండ, అక్టోబర్ 25 : ముస్లిం మైనార్టీల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమని బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండీ నయిూమొద్దీన్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఉర్దూలో రూపొందించిన బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నయిూముద్దీన్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ముస్లిం మైనార్టీలకు అండగా నిలుస్తుందన్నారు. ఉర్దూ ఘర్లు, షాదీ ఖానాలు, మసీదుల నిర్మాణాలతో పాటు, మైనార్టీల గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసి, విద్యారంగానికి పెద్దపీట వేసిందని తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా రూ. లక్ష రుణం, కుట్టు మిషన్లను పంపిణీ చేసి, అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయనున్నట్లు తెలిపారు. షాదీముబారక్ పథకం ద్వారా రూ.101,116 అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్‌దేనన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రాష్ట్రంలో మత ఘర్షణలు లేవన్నారు. గురువారం హనుమకొండ సుబేదారిలోని అసంత భవన్‌లో సర్వ మతస్తులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో దాస్యం వినయ్ భాస్కర్‌ను భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని, ఇందుకు ముస్లిం మైనార్టీలందరం కృషి చేస్తామన్నారు. ముస్లిం మైనార్టీలందరూ బీఆర్‌ఎస్ వెంట ఉన్నారన్నారు. మైనార్టీల బంధుతో పాటు గృహలక్ష్మి పథకంలో కూడా అవకాశం కల్పిస్తున్న సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు అబ్దుల్ ఖుద్దూస్, బియ బాని, సోనీ, మహమ్మద్, అఫ్జల్, హుస్సేన్, డాక్టర్ అక్బర్, ఇస్మాయిల్, సత్తార్, అంకుషావలి, ఖలీల్, సాదిక్, షౌకాత్, తస్లీం, పర్వేన్, యాసిన్ పాల్గొన్నారు.